క్లుప్తంగా

వడ్లు జోకారు



వడ్లుకాంట వేస్తున్న హమాలీలు

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని కుందేల్‌పహాడ్‌కు చెందిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు రోడ్డు పక్కన ధాన్యం కుప్పలుగా పోసి ఉంచారు. 25 రోజులు గడిచినా తూకం వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'వడ్లు జోకుతలేరు' కథనం సాక్షిలో బుధవారం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి రోడ్డు పక్కన కుప్పలుగా పోసిన ధాన్యాన్ని ఐకేపీ సిబ్బంది తూకం వేయించారు.

6 కేంద్రాల్లోనే 80 శాతం పైగా..

దండేపల్లి: ఈ నెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో దండేపల్లి మండలంలో 49 పోలింగ్ కేంద్రాల్లో కేవలం 6 పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే 80 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యింది. మాకులపేట పోలింగ్ కేంద్రం 5 లో 83 శాతం, బిక్కనగూడ పోలింగ్ నం 19లో 82, కాసిపేట పోలింగ్ కేంద్రం 23లో 81 శాతం, వెల్గనూర్‌లో పోలింగ్ కేంద్రం 24 లో 85శాతం, 25లో 82 శాతం, కుందేల్‌పహాడ్‌లోని పోలింగ్ కేంద్రం 41 లో 82 శాతం పోలింగ్ నమోదు కాగా, మిగిలిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో 60, 70 శాతంకు పైగా మాత్రమే నమోదయ్యింది. మండలంలో మొత్తం 41,301 మంది ఓటర్లకు గాను 29,646 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో మండలంలో 71.78 శాతం పోలింగ్ నమోదయ్యింది.

మోడల్ స్కూల్లో ఇంటర్ అడ్మిషన్‌లకు దరఖాస్తులు

కాసిపేట: మండలంలోని తెలంగాణ మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అంది నాగమల్లయ్య తెలిపారు. టీఎస్ మోడల్‌స్కూల్ డాట్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్యా, యూనిఫాం, పుస్తకాలు, ఒకేషనల్ కోర్సు విద్యాబోధన, అధ్యాపక బృందం, డిజిటల్ పద్ధతిలో విద్యాబోధన, దూర ప్రాంత బాలికలకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నస్పూర్: పట్టణ పరిధిలోని కసుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ మౌనిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఒక్కో గ్రూపులో నలభై సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. జూన్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అంగన్‌వాడీలో ఆరుగురికి సీమంతం



సీమంతం చేస్తున్న మమత సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మంచిర్యాల మహిళా తరంగిణీ(మమత) ఆధ్వర్యంలో ఆరుగురు గిరిజన, స్థానిక మహిళలకు సీమంతం చేశారు. మమత అధ్యక్షురాలు రాచకొండ మంజులాకృష్ణారావు, కార్యదర్శి లత, కోశాధికారి నాగమణి, సలహాదారురాలు డాక్టర్ చిదానందకుమారి పాల్గొని వస్త్రాలు, గాజులు, పసుపు–కుంకుమలు, పూలు, పండ్లు, మిఠాయిలతో సంప్రదాయబద్ధంగా సీమంతం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, తల్లులు, కిషోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

కొలనులో కోతుల ఆటలు..!

- కలుషితం అవుతున్న నీరు
- ఇబ్బంది పడుతున్న ఈతగాళ్లు
- స్విమ్మింగ్ పూల్ గోడకు విద్యుత్ కంచె వేయాలని డిమాండ్



సీసీసీలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్ నీటిలో ఆడుతున్న కోతులు

శ్రీరాంపూర్: మనుషులు ఈత కొట్టాల్సిన స్విమ్మింగ్‌పూల్‌లో కోతులు ఈతలు కొడుతున్నాయి. దీంతో నీరు కలుషితం అవుతున్నాయి. సీసీసీలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్ కోతులకు వేసవి ఆట విడుపుగా మారింది. నిత్యం కోతులు ఇందులో ఆటలు ఆడుతున్నాయి. ఈ స్విమ్మింగ్ పూల్ ఉదయం, సాయంత్రం రెండు పూటలు తెరిచి ఉంటుంది. ఆ సమయంలో జనాలు ఈతకు రావడంతో కోతులు రావడం లేదు. కానీ జనాలు రాకముందు, వచ్చి వెళ్లిన తరువాత ఎవరూ లేని సమయం చూసి కోతులు స్విమ్మింగ్‌లో చేరుతున్నాయి. గుంపులు గుంపులుగా వస్తూ నానా హంగామా చేస్తున్నాయి. అసలే కోతులు అందులో ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి తేలుతూ జలకాలడుతున్నాయి. ఆటలతో పాటు మల, మూత్ర విసర్జనలు కూడా చేస్తున్నాయి. మనుషులు గేట్ వద్దకు వచ్చే శబ్దం విని వెంటనే జారుకుంటున్నాయి. ఈ కోతుల చేష్టలతో స్విమ్మింగ్ పూల్‌లో నీరు కలుషితం కావడంతో ఈతకు వచ్చే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

విద్యుత్ కంచె వేయాలి..

స్విమ్మింగ్‌పూల్ చుట్టూ ఎత్తైన ప్రహరీ ఉంది. ఈ గోడపై నుంచి కోతులు లోపలికి దూకి వస్తున్నాయి. ఈ గోడపై విద్యుత్ కంచెను ఏర్పాటు చేస్తే కోతుల బెడద ఉండదని కార్మికులు పేర్కొంటున్నారు. దీనికి తోడు గాలి దుమారం వచ్చిందంటే ఆకులు, చెత్త గాలికి వచ్చి స్విమ్మింగ్‌పూల్ నీరు కలుషితం అవుతుంది. ఒక్క గాలి దుమారం వచ్చిందంటే దాన్ని శుభ్రం చేయడానికి వారం రోజులు బంద్ పెట్టాల్సి వస్తుంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్‌కు పైన కప్పు వేయిస్తే ఇలాంటి ఇబ్బంది ఉండదని కార్మికులు పేర్కొంటున్నారు. దీనికి తోడు కలుషితం అయినప్పుడల్లా పూల్‌ను కడగడానికి నీటిని తోడి, తిరిగి నింపి, దాన్ని ఫిల్టర్ చేయడానికి కనీసం వారం రోజులు పడుతుంది. వారం పాటు స్విమ్మింగ్ పూల్‌ను బంద్ పెడుతున్నారు. దీన్ని కడిగిన తరువాత 4రోజుల పాటు నీరు నింపడానికే సమయం పడుతుంది. ఐతే కాలనీలకు సరఫరా చేసే లైన్ కాకుండా ప్రత్యేకంగా మరో లైన్‌వేసి నీటిని నింపితే ఒకటి రెండు రోజుల్లో స్విమ్మింగ్‌పూల్‌ను నింపి త్వరగా తెరిపించవచ్చని దీనిపై అధికారులు ఆలోచనలు చేయాలని కార్మికులు పేర్కొంటున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రాధారాథోడ్

భీమారం: మండలంలోని పోతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను బుధవారం ఎంపీడీవో రాధారాథోడ్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు తెరిచే లోపు పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఇందులో కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

భీమారం: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను రక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో రాధా రాథోడ్ తెలిపారు. మండల కేంద్రంలోని నర్సరీని బుధవారం ఆమె సందర్శించారు. మరోనెల రోజుల పాటు మొక్కలను కాపాడేందుకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యంగా రోజుకి రెండు సార్లు నీటిని అందించాలని కార్యదర్శి వేముల శ్రీనివాస్‌ని ఆదేశించారు.

కళాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హమాలీ సంఘం నాయకులు

చెన్నూర్: పట్టణానికి చెందిన ఏల్పుల పోచం అనే చిత్రకారుడు ఏడు సంవత్సరాల క్రితం చేపట్టిన లైవ్ డ్రాయింగ్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర వచ్చే నెల 7న ముగియనుంది. కళాయాత్ర ముగింపు ఉత్సవాల సందర్భంగా స్థానిక హమాలీ సంఘం నాయకులు బుధవారం అంబేద్కర్ చౌరస్తాలో కళాయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెన్నూర్‌కు చెందిన చిత్రకారుడు పోచం చెన్నూర్ కీర్తిని దేశ వ్యాప్తంగా చాటారన్నారు. ముగింపు ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు దాసరి పోచం, ఆకుల రవి, సమ్మయ్య, బానయ్య, సంతోశ్, రాజన్న పాల్గొన్నారు.

మూతపడ్డ వ్యవసాయ కార్యాలయం



తాళం వేసి ఉంచిన కార్యాలయం

భీమారం: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని రెండేళ్ల నుంచి మూసి ఉంచుతున్నారు. మండలం ఏర్పడ్డ సమయంలో తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి ప్రభుత్వం అప్పుడు రెగ్యులర్ ఏవోని కేటాయించారు. అయితే కొన్నాళ్ల తరువాత ఏవోని ప్రభుత్వ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇక అప్పటి నుంచి ఇన్‌చార్జి అధికారులనే భీమారానికి కేటాయిస్తున్నారు. వారు ఈ కార్యాలయానికి రాకపోవడంతో ఎప్పుడూ తాళాలు వేసే ఉంచుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన రైతువేదికలో ఏఈవో కార్యాలయం ఏర్పాటు చేసుకొని పాలన చేస్తున్నారు. దీంతో వ్యవసాయ కార్యాలయం వైపు అధికారులు వెళ్లడం లేదు. మండలానికి రెగ్యులర్ ఏవోని నియమించి కార్యాలయాన్ని తెరిచి ఉంచాలని రైతులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రమాదకరంగా 'ఉపాధి' పనులు



రోడ్డు పక్కనే తవ్విన గుంతలు

భీమారం: కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన పనులు భీమారం మండలం బూర్గుపల్లి–నర్సింగాపూర్ మధ్య రహదారి మధ్య ప్రమాదకరంగా మారాయి. కూలీలకు పని కల్పించేందుకు మండలంలో చేపట్టిన ట్రెంచీల నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బూర్గుపల్లి–నర్సింగాపూర్ మధ్య అటవీప్రాంతంలో రోడ్డుకి సమీపంలో ట్రెంచీలు నిర్మిస్తున్నారు. ఒకవేళ రోడ్డుపై నుంచి ప్రమాదవశాత్తు దిగిన వాహనాలు ట్రెంచీల్లో పడి ప్రమాద తీవ్రత మరింతగా పెంచే ప్రమాదం ఉంది. రోడ్డు పక్కనే కాకుండా కొంత దూరం తవ్వించాల్సిన ట్రెంచీలను అధికారుల పర్యవేక్షణ లేక కూలీలతో ఇష్టారాజ్యంగా తవ్విస్తున్నారు. అటవీప్రాంతం పెద్దఎత్తున ఉన్నప్పటికీ రోడ్డు పక్కనే ఎందుకు తవ్విస్తున్నారో అధికారులకే తెలియాలని ప్రజలు అంటున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని ట్రెంచీలను అడవిలోపల తవ్వేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

జన్నారం: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన గోనె రామక్క కుమారుడు నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబానికి రోటిగూడ సామాజిక సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు గాజుల సత్తయ్య, ఉప్పు శ్రీనివాస్, గట్టయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, నర్సింగ్, లవన్‌కుమార్, మల్లేష్, గోపాల్, చంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన మేకలు అమ్ముతూ జీవనం సాగించే కె.సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా నిరుపేదరికంలో ఉన్న అతడి కుటుంబ సభ్యులకు తమవంతు చేయూతగా ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ వారు బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మణ్, సురేష్, శరత్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

లక్సెట్టిపేట: స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మంచిర్యాల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులకు గమ్యం యాప్, టూ వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు సిగ్నల్స్ పాటించాలని, ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలని తెలిపారు. సుదూర ప్రయాణాలకు ఆర్టీసీ రిజర్వేషన్ సౌకర్యాన్ని మహాలక్ష్మి పథకం ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రతపైన పాటించాల్సిన పద్ధతులను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్. మోహన్, సేఫ్టీ వార్డెన్ మౌళి, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో చేదోడు.. వాదోడుగా..!



దండేపల్లి: టెన్త్, ఇంటర్, డిగ్రీ పరీక్షలు రాసిన విద్యార్థులు సాధారణంగా వేసవి సెలవుల్లో వివిధ శిక్షణలు తీసుకుంటుంటారు. ఆ స్థోమత లేని కొందరు పేద విద్యార్థులు సెలవుల్లో ఎంతో కొంత సంపాదించి, వారివారి ఉన్నత చదువుల కోసమో లేదా తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఉపయోగిస్తున్నారు. దండేపల్లి మండలంలో పలు గ్రామాల విద్యార్థులు వేసవి సెలవుల్లో మామిడి కాయల కోతకు వెళ్తున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు బృందాలుగా ఏర్పడి, గ్రామాల శివారుల్లో గల మామిడితోటల్లో మామిడి కాయలు కోతకు వెళ్తు ఒక్కొకరు రోజుకు రూ.500 చొప్పున సంపాదిస్తున్నారు. మండలంతో పాటు ఇతర మండలాలకు కూడా వెళ్తున్నారు.

ఇద్దరికి చూపునిచ్చిన పీడీ



దివంగత పీడీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీడీలు, పీఈటీలు, వాకర్స్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడకు చెందిన గడిగొప్పుల సదానందం(46) మంగళవారం గుండెపోటుతో మృతిచెందగా.. కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. రామకృష్ణాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా పనిచేస్తూ ఎన్నికల విధులకు వెళ్లి వచ్చిన తర్వాత మృతిచెందిన విషయం తెలిసిందే. అమెరికాలో ఉన్న కూతురు, అల్లుడు వచ్చేందుకు ఆలస్యం అవుతుండడంతో మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో భద్రపర్చారు. సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ఎన్నికల విధుల్లో మృతిచెందిన గడికొప్పుల సదానందం కుటుంబాన్ని ఆదుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇ.కరణ్, కార్యవర్గసభ్యులు భారీక్‌రావు పాల్గొన్నారు.

దివంగత పీడీకి ఘనంగా శ్రద్ధాంజలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో సదానందం చిత్రపటం వద్ద బుధవారం పలువురు నివాళులు అర్పించారు. క్రికెట్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ అసోసియేషన్‌ల కోచ్‌లు, పలువురు పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయ, ఉద్యోగులు, వాకర్స్ అసోసియేషన్, ఫిట్‌నెస్ క్లబ్, ఓం అష్టోత్తర పీట్ యోగా సభ్యులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా



మాట్లాడుతున్న ఎంపీపీ గోదారి రమాదేవి

జైపూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోదారి రమాదేవి, ఎంపీడీవో సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి పలుశాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సమావేశం సాదాసీదాగా జరిగింది. ప్రతిసారి నిర్వహిస్తున్న సర్వసభ్య సమావేశానికి అధికారులు సరిగ్గా రాకపోవడం, కొన్నిశాఖల అధికారులు మాత్రమే వస్తుండటం అధికారుల తీరు మారకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. సుమారు 29అంశాలకు సంబంధించి అధికారులు హాజరై శాఖల వారీగా ప్రగతి నివేదికలను వివరించాల్సి ఉండగా కేవలం 7శాఖల అధికారులు హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని సభ్యులపై చర్యలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నట్లుగా ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ కోతలు, తాగునీరు, రైతుబంధు పథకాల అమలుపై సభ్యులు ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, సభ్యులు రామటెంకి లింగస్వామి, బడుగు రవి, సతీశ్, పెద్దలబాపు, తదితరులు పాల్గొన్నారు.

టీహబ్‌లో పరీక్షలు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన 21 రకాల పరీక్షలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే టీ హబ్‌లో ఉచితంగా నిర్వహించాలని కోరుతూ రెడ్‌క్రాస్ సభ్యులు బుధవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డికి వినతిపత్రం అందించారు. జూన్ 19వ తేదీన ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా, టెస్టులను ప్రారంభించేలా చూడాలని కోరగా, అందుకు సూపరిండెంట్ సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి వి.మధుసూదన్ రెడ్డి, కోశాధికారి కే.సత్యపాల్ రెడ్డి, బ్లడ్‌బ్యాంకు సూపర్‌వైజర్ కే.మాధవి పాల్గొన్నారు.

ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొని టీఏ, డీఏలు చెల్లించాలన్నందుకు ఉపాధ్యాయులపై పోలీసు లాఠీచార్జీ చేయించటంపై తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజావేణులు తీవ్రంగా ఖండించారు. ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అటెన్షన్ ప్లీజ్..

అసంపూర్తిగా పిల్లకాలువలు



భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి పిల్లకాలువలు నిర్మించేందుకు అధికారులు పనులు మొదలు పెట్టి అసంపూర్తిగా వదిలిపెట్టారు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంటపొలాల పక్క నుంచి కాలువ వెళ్తున్నా, తమ పొలాలకు నీరు అందడం లేదని రైతులు తెలిపారు. గతంలో ప్రధాన కాలువ నుంచి పంటపొలాలకు నీరందించేందుకు పిల్లకాలువల నిర్మాణానికి పనులు చేపట్టిన అధికారులు అసంపూర్తిగా వదిలిపెట్టారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేసిన పిల్లకాలువల ద్వారా నీటిని అందించాలని భీమారం, అంకూసాపూర్ రైతులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: శశాంక్ రెడ్డి, గొల్లవాగు ప్రాజెక్ట్ ఇంజనీరు

ఫోన్ నంబర్ : 95052 89404

మానసిక ధృడత్వాన్ని పెంచుకోవాలి



ప్రసంగిస్తున్న వైద్యుడు సునీల్

మంచిర్యాలఅర్బన్: జీవితంలో ఒడిదుడుకులు సర్వసాధారణమని ఆత్మవిశ్వాసం, మానసిక ధృఢత్వాన్ని పెంచుకోవాలని సైక్రియాటిస్ట్ వైద్యుడు సునీల్ అన్నారు. మంచిర్యాలలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (టీపీఏ) ఆవిర్భావ దినోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి వ్యక్తి అనేకమార్లు మానసిక ఒత్తిడికి లోనవుతారని, వీలైనంత త్వరగా మానసిక ఒత్తిడి నుంచి బయటపడి ప్రశాంత ఆలోచనలతో మన దైనందిన కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. మానసికంగా ధృడంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు సైకాలాజిస్టులు అవగాహన కల్పించాలన్నారు. మానసిక సమస్యల పరిష్కారానికి టెలిమానస్ కాల్‌సెంటర్ 14416లో సహాయం పొందవచ్చన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించిన గుండేటి యోగేశ్వర్, పురుషోత్తం నాయక్‌లను సన్మానించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చెరుకు శశికిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు, జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, క్రిష్ణవేణి టాలెంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కస్తూరిపద్మచరణ్, సృజన, రజిత, అశోక్‌రావు, సుమనచైతన్య తదితరులు పాల్గొన్నారు.